క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మతల్లి తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: గ్రామంలోని జువ్వలదొడ్డి కొలువైన ఉన్న సత్తెమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. వచ్చిన భక్తులు ఎటువంటి అవాంఛన సంఘటన జరగకుండా కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. వచ్చే ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారధన నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

సత్తెమ్మను దర్శించుకున్న సినిమా డైరెక్టర్ కృష్ణారెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న సినిమా డైరెక్టర్ సత్తి వెంకట కృష్ణారెడ్డి

బిక్కవోలు: కొంకుదురు గ్రామ చిన్నం వంశీయుల ఇలవేల్పు అయిన సత్తెమ్మ తల్లి అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సినిమా డైరెక్టర్, చిన్నం కుటుంబ అల్లుడు ఎస్వీ కృష్ణారెడ్డి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం కృష్ణారెడ్డిని గ్రామస్తులు సత్కరించారు. సత్తెమ్మ తల్లీ అమ్మవారి సంబరంతో చిన్నం వంశీయులకు మరో పండగా వాతావరణం కనిపిస్తోంది. ఈ వంశీయులతోపాటు ఆడపడుచులకు కుటుంబ సభ్యులతో అమ్మవారి సంబరం జరిపించడంతో ఆనవాయితీగా వస్తుంది. ఎక్కడ ఉన్న ఈ సంబరం రావడం చిన్నం వంశీయులు, ఆడపడుచులు కుటుంబాలతో వచ్చి అమ్మవారి దర్శించుకుంటారు.

గ్రీవెన్స్‌కు హాజరుకానున్న కలెక్టర్

రాజానగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా మండల కేంద్రంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి హాజరుకానున్నారు. అలాగే వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె ఆదేశించారని స్థానిక తహసీల్దారు జీఏఎల్ సత్యవతిదేవి తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రానికి ఎన్నో వ్యయప్రయాసలతో వస్తున్న జనావళికి దూరాభారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మండల ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో ఉదయం స్వామివారికి పూజలు చేసి, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం వ్రత పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రేషన్ డీలర్ల నియమకానికి పరీక్ష



పరీక్ష రాస్తున్న రేషను షాపు డీలర్ అభ్యర్థులు

రాజానగరం: డివిజన్‌లో రేషన్ షాపు డీలర్ల నియమాకమానికి స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఆదివారం పరీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఖాళీలున్న 145 షాపులకు డీలర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా 487 దరఖాస్తులొచ్చాయని స్థానిక తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి తెలిపారు. పరీక్షకు మాత్రం 465 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు.

సస్య రక్షణ చర్యలే తోటలకు రక్ష

- పూత దశలో మామిడి, జీడిమామిడి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



బొల్లెద్దుపాలెంలో మామిడి తోట



కణుపూరులోని మామిడి తోటలు

మధురపూడి: మెట్ట ప్రాంత రైతులకు పండ్ల తోటలే ప్రధాన ఆదాయ వనరుగా సాగు చేస్తున్నారు. ఇక్కడ ఎక్కువగా మామిడి, జీడిమామిడి తోటలు ఉంటాయి. ప్రస్తుతం మామిడి, జీడిమామిడి పూతకొచ్చింది. ఈ సమయంలో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తున్నందున రైతులు మరింత జాగ్రత్తలు పాటించాలని వివరిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 7,040 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి, జీడిమామిడి తోటలున్నాయి. తోటల సంరక్షణకు ఉద్యానవన శాఖాధికారులు రైతులు పలు సూచనలిస్తూ, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు అందని ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోండడంతో రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయంలో భాగంగా రైతన్నలకు భరోసా కల్పించకపోవడంతో పెట్టుబడి విషయంలో అప్పుల పాలవ్వుతున్నారు. పెట్టుబడి సాయాన్ని కల్పించకపోవడంతో సన్న, చిన్న కారు రైతులకు అవస్థలు తప్పడంలేదు. మెట్ట ప్రాంతంలో మామిడి, జీడి మామిడి తోటలను కౌలురైతులు, సంవత్సరం లీజుకు తీసుకుని సాగు చేస్తున్నారు. రైతులు ఎకరం మామిడికి రూ.15 వేల పెట్టుబడి పెడుతున్నారు. జీడిమామిడికి అయితే ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకూ ఖర్చవుతోంది.

తెగుళ్లు– నివారణ చర్యలు

- మామిడి, జీడి మామిడి తోటలకు ఎక్కువగా తేనెమంచు, తేయాకుదోమ, కాండంతొలుచు పురుగు తెగుళ్లు సోకుతాయి. దీనివల్ల దిగబడి బాగా తగ్గిపోతుంది. దీనికి వేపనూనె పిచికారీ చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. కాండం తొలుచు పురుగు వల్ల ఎక్కువ నష్టం ఏర్పడుతుంది. చిగురుదశలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మోనోక్రోటోఫస్ 1.6 ఎంఎల్ మందును లీటరునీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే పిందె దశలో ప్రోఫెన్‌పోజ్–1 మిల్లీలీటరు మందును లీటరు నీటిలో పిచికారీ చేయాలి. కాండంతొలుచే పురుగును ఊస ద్వారా బయటకు తీసి, కాల్చేయాలి.
- తేనె మంచుపురుగు, మొగ్గతొలుచు పురుగు, బూడిద తెగులు నివారణకు మొదటి దశ పిచికారీగా నల్ల గంధకం 3 గ్రాములు, క్లోరోఫైరిఫాస్ ఒక ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పూ మొగ్గదశలో పిచికారీ చేయాలి.
- పచ్చిపూత దశలో రోగార్–2 ఎంఎల్, లేదా ఇమిడాక్లోప్రిడ్ మూడు ఎంఎల్ లీటరునీటిలో కలిపి కొమ్మలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. మామిడి పూత నిలబడడానికి వేపనూనె రెండు ఎంఎల్, లేదా మేంకోజెబ్ రెండు గ్రాములు, ప్లేనోఫిక్స్ రెడు ఎంఎల్‌ను లీటరు నీటికి పిచికారీ చేస్తే పూత నిలబడుతుంది.

యాజమాన్య పద్ధతులు



రినీ

మామిడి, జీడిమామిడి తోటల్లో యజమాన్య పద్ధతులను అనుసరించాలని కోరుకొండ ఉద్యానశాఖాధికారి రినీ చెబుతున్నారు. తోటల్లో వీడింగ్, దుక్కి దున్నించడం వల్ల చెట్టుకు బలం లభిస్తుంది. చెట్టు చుట్టూ పళ్లాలు తవ్వితే నీరు నిలిచి పూతకు సాయపడుతుంది. చెట్టుకు ఉన్న ఎండి కొమ్మలను తొలగించి, అంతా శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తు చీడపీడలు చేరకుంటా ఉంటాయి.

రైతులను ప్రోత్సహించాలి



పండ్ల తోటల రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. అది స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. నిల్వ చేసుకునే సదుపాయం లేకపోవడంతో వ్యాపారస్తులు చెప్పిన ధరలకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. గిడ్డంగి సదుపాయాన్ని కల్పించాలి.

– కంటే వినయ్‌తేజ, రైతు నాయకుడు, బూరుగుపూడి

యాజమాన్య పద్ధతులతోనే దిగుబడి

మామిడి, జీడిమామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. అప్పుడే దిగుబడి అనుకున్న స్థాయిలో లభిస్తుంది. చెట్లను శుభ్రంగా ఉంచుకోవాలి. చీడపీడలు చేరకుండా ఉంటాయి. ఉద్యానశాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. తద్వారా దిగుబడి పెరుగుతోంది.

– కోటా సుబ్రహ్మణ్యం, రైతు నాయకుడు

శనగ పంటకు పొగ మంచుతో మేలు



చంద్రేడులో శనగ మొక్కలు

రంగంపేట: ప్రస్తుతం శనగ పంటకు పొగ మంచు మేలు చేస్తుంది. గత కొద్ది రోజులుగా మంచు, చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆ వాతావరణం శనగ పంటకు కలిసొచ్చింది. సాధారణంగా శనగ సాగుకు ఒకటి, రెండు నీటి తడులుంటే సరిపోతుంది. మంచు కారణంగా మొక్కలు ఎదుగుతాయి. మండల పరిధిలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో వరి, మినుములు సాగు చేశారు. ఆ పంటలు ఒబ్బిడి అనంతరం రబీలో శనగ సాగు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 25 శాతం రాయితీపై 63 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో 800 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ప్రస్తుతం శనగకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో పొలాల్లోని మొక్కలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ముందుగా వేసిన పొలాల్లో మొక్కల నుంచి పూత సైతం వస్తోంది.

ఎస్సీ వర్గీకరణ సహేతుకం కాదు



'అమిత్ షా గో బ్యాక్' అంటూ సూర్యారావుపేటలో నిరసన ర్యాలీ చేస్తున్న మాలల ఐక్య వేదిక కమిటీ సభ్యులు

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని మాలల ఐక్య వేదిక ఆర్గనైజింగ్ కమిటీ పిలుపునిచ్చింది. సూర్యారావుపేటలో జిల్లా కోకన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన కమిటీ సమావేశంలో పలువురు మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయడం వల్ల మాలలకు తీరని నష్టం వాటిల్లుతుందని కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించండి అనే నినాదంతో రిపబ్లిక్ డే రోజున భారీ ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రానికి వస్తున్నందున 'అమిత్ షా గో బ్యాక్' అంటూ గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ముప్పిడి శ్రీను, నాగేశ్వర్రావు, కోల్లాటి చినవెంకన్న, కేదాసి వీర్రాజు, పనిపే నాని, తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు



విజయదుర్గా పీఠంలో విజయదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన గాయత్రి అస్థానంలో విజయదుర్గా పీఠంలో విజయదుర్గ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు గాడ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు పుట్టిన రోజులు శుభాకాంక్షలు తెలియజేశారు. గాడ్ నుంచి ఆశీస్సులు తీసుకున్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

మధురపూడి: కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

సీతానగరం: మండల గ్రామాల్లో సోమవారం నుంచి ఈనెల 30 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఆండ్ర ఫణీంద్ర తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలో పది ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 21న పురుషోత్తపట్నం, 22న బొబ్బిల్లంక, 23న సింగవరం, 24న ముగ్గళ్ళ, 25న కాటవరం, 27న రఘుదేవపురం, 28న ఉండేశ్వరపురం, 29న కూనవరం, 30న నాగంపల్లిలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని డాక్టర్ ఫణీంద్ర తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

సీతానగరం: రఘుదేవపురంలో పేకాట ఆటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. రఘుదేవపురం గ్రామ శివారున పేకాటాడుతుండగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.4,500 స్వాదీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

కొట్లాటపై కేసు నమోదు

సీతానగరం: ముగ్గళ్లకు చెందని గెడ్డం అనిల్ కుమార్‌ను కొట్టినందుకు పెనుగుల రవిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గత నెల 31వ తేదీన రాత్రి అనిల్‌కుమార్ తన ఇంటి వద్ద ఫ్లెక్సీ కడుతుంటే పెనుగుల రవి, మరి కొంత మంది వచ్చి కొట్టగా బాధితుడు రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందారని, ఆసుపత్రి సమాచారం, కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బిక్కవోలులో కలిసిన 1977-78 పదో తరగతి విద్యార్థులు

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాలలో 1977–78 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. అక్కడ చదువుకున్న వారంతా లక్ష్య సాధనకు వేర్వేరు దారుల్లో ప్రయాణించి ఉద్యోగం, వ్యాపారం తదితర రంగాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు ఆ పాఠశాలలో కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా వారంతా సందడి చేశారు. ముందుగా తమ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు మరణించిన వారికి సంతాపం తెలియజేశారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి యువకుడి మృతి



మృతుడు వెంకటేష్

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన చండిక వెంకటేష్(34) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని ఎస్సై హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్ వ్యవసాయ పనులు చేసుకుంటు ఉన్నాడు. ఆయనకు చిన్నతనం నుంచి ఫిట్స్ వ్యాధి ఉంది. ఆదివారం ఉదయం బహిర్భూమికి శుద్ద చెరువు వద్దకు వెళ్లగా అక్కడ ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. మృతుడికి తండ్రి పాపారావు, తల్లి శ్యామల, అన్న ఆనంద్, తమ్ముడు హరికృష్ణ ఉన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోదరుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

కలెక్టరేట్‌లో యోగి వేమన జయంతి



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్న రాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జీవిత సత్యాలను పద్యాల రూపంలో అందించిన మహోన్నత వ్యక్తి యోగి వేమన అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం యోగి వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ చిన్న రాముడు మాట్లాడుతూ వేమన ఎన్నో భోగభాగ్యాలు అనుభవించి, అవి ఏవీ జీవిత సత్యాలు కాదని తన రచనలు ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తిత్వం ఉన్న వారన్నారు. ఆయన రచనల ద్వారా జీవితా సత్యాలను తెలుసుకుని భావి తరాలకు అందించే ప్రయత్నం ప్రతి ఒక్కరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, కలెక్టరేట్ ఏవో ఎండీ ఆలీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తరణ



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రానున్న కాలంలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తామని తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలో రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న వారందరికీ ఆమె చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడు ముందుంటుందన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వివిధ సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగానే ఒక రోజు ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ శిక్షణలో 26 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ దల్ సింగ్, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్లు మహాలక్ష్మి, కేవీ రమణ, బండి వెంకటేశ్వరరావు, ట్రైనర్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఏపీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్‌గా డాక్టర్ యోగానంద్, ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎంఎం.రాజేష్ వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ ఏవీ ప్రసన్నకుమార్(ఏరియా వెటర్నరీ హాస్పిటల్, రాజమహేంద్రవరం), జనరల్ సెక్రటరీగా డాక్టర్ కేఎస్వీ చంద్రమౌళి(వెటర్నరీడి స్పెన్సరీ, వాడపల్లి), కోశాధికారిగా డాక్టర్ ఎం.ధరిన్‌బాబు (వెటర్నరీ డిస్పెన్సరీ, రాజంపాలెం), ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.అరుణ(వెటర్నరీ డిస్పెన్సరీ, పుణ్యక్షేత్రం), జాయింట్ సెక్రటరీగా డా.షేక్‌జహంగీర్‌పీరా (వెటర్నరీడిస్పెన్సరీ, రంగంపేట) ఎన్నికైనట్టు యోగానంద్, రాజేష్ తెలిపారు.

జీసీజీటీఏ జిల్లా కార్యవర్గ ఎన్నికలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జిల్లా స్థాయిలో తూర్పు గోదావరి జిల్లా జీసీజీటీఏ(గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్) కార్యవర్గ ఎన్నికలు ఆదివారం దిగ్విజయంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా జి. చంద్రశేఖర్, సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.డి.మదీనా, ట్రెజర్ కె.నాగ సూర్య నారాయణ ఎన్నికయ్యారు. జిల్లా స్థాయి ఎలక్షన్ ఆఫీసర్‌గా డాక్టర్ పి.హరేరామ ప్రసాద్ వ్యవహరించారు.

వంద మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

సీటీఆర్ఐ: స్థానిక సంజీవనగరంలో జూలి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఉదయం సుగర్ పాస్టింగ్ టెస్ట్ నిర్వహించిన తరువాత అక్కడే వారికి అల్పాహారం ఏర్పాటు చేసి గంట గడచిన తరువాత తిరిగి మళ్లీ సుగర్ టెస్ట్ చేశారు. సుగర్‌తో బాధ పడేవారికి మందులతో పాటు ఆహారంలో మార్పులను సూచించారు. సుమారు వందకి పైగా పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జూలి అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు రెవరెండ్ జూలి అమ్మ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితం ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విమల, అభిషేక్, సుభాషిణి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.